క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు -2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల సరఫరా ఉండదని చెప్పారు. వికాస్ నగర్ 4వ లైను నుంచి 11వ లైను, నవభారత్ నగర్ 2 నుంచి 4/3వ లైను ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీపద్మావతి గోదాసమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం నుంచి అష్టబంధన మహాసంప్రోక్షణ సహిత మహా కుంభాభిషేకం మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో హోమాలు, పూర్ణాహుతి నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకోండి

నెహ్రూ నగర్: ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 95523 00009 నంబర్ ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రారంభించిందని, ప్రజలు వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 32 మున్సిపల్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని ప్రజలకు పంపించేందుకు ఈ వాట్సాప్ అకౌంట్ నుంచే అధికారిక సమాచార మెసేజ్‌లు పంపిస్తుందన్నారు. ఉదాహరణకు వర్షాలు, వరదలు, విద్యుత్ మరమ్మతులు, ఎమర్జెన్సీ, హెల్త్, పర్యాటకం, వ్యవసాయం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి సమాచారాన్ని అందిస్తారన్నారు.

జీజీహెచ్ హెడ్ నర్సుకు సన్మానం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో హెడ్‌నర్సుగా పనిచేస్తూ శుక్రవారం పదవీ విరమణ చేసిన నల్ల విజయలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జీజీహెచ్‌లోని శుశృత హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆస్పత్రిలో నర్సుల సేవలు ఎంతో కీలకమైనవన్నారు. రోగి త్వరగా కోలుకొని ఇంటికి వెళ్లేవరకు నర్సులు కీలక మైన వైద్య సేవలు అందిస్తారన్నారు. నర్సుల సంఘం జిల్లా సెక్రటరీ వెలంపల్లి పద్మజ, నేతలు శ్రీదేవి, హేమలత, ఆశాలత, సునీత, భూలక్ష్మి, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ గంగమ్మ, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లు కిరణ్మయి, విద్య, పద్మ, నాంచారమ్మ, రమాదేవి, జయలలిత పాల్గొన్నారు.

బడ్జెట్ పెద్దది.. కేటాయింపులు చిన్నవి..



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పెద్దది.. కేటాయింపులు చాలా చిన్నవి. వ్యవసాయ, విద్యా రంగాలకు కేటాయింపులు చాలా తక్కువగా కేటాయించారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ఈ బడ్జెట్లో చాలా అన్యాయం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలు, సంక్షేమ అభివృద్ధి కేటాయింపులు అనుకున్న స్థాయిలో లేవు. 300 యూనిట్లు వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అందించాలి.

బత్తుల వీరాస్వామి... అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కోతల బడ్జెట్ ఇది



కూటమి ప్రభుత్వం భారీగా అప్పులు, అంచనాలతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా కోతలుగా ఉంది. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి చోటు లేకుండా అటు నిరుద్యోగ యువతను, మహిళలను మోసగించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం పథకంలో భారీగా కోతలు విధించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను తగ్గించి, ఇచ్చిన హామీలను తుంగతో తొక్కే ప్రయత్నం ఇది. డ్వాక్రా మహిళలకు సైతం కేటాయింపులు లేకపోవడం, మహిళా శక్తి పథకాన్ని సైతం మాయ చేయడం చూస్తే నమ్మి ఓట్లు వేసి గెలిపించిన మహిళలను దగా చేయటమే. జాబ్ క్యాలెండర్, ఫీజు రీ-యింబర్స్‌మెంట్ బకాయిలకు నిధులు విడుదల లేకుండా గారడీ చేశారు.

-పిల్లి ఓబుల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, రొంపిచర్ల

ఉద్యోగులను నిరాశపరచిన బడ్జెట్



బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణకు సంబంధించి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసింది. 12వ పీఆర్సీ ఇప్పటికే రెండేళ్లు ఆలస్యమైంది. ఎన్నికల ముందు ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని అస్సలు పట్టించుకోకపోవడం దారుణం. డీఏ బకాయిలను ఒక్క విడత కూడా చెల్లించకపోవడం ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి, నిర్లక్ష్యానికి నిదర్శనం. తక్షణమే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను కలుపుకుని డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ చేపడతాం.

-మేకల సుబ్బారావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

మేడిపండు చందం



రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అత్యంత మెజారిటీతో గెలిపించారన్న విషయాన్ని మరిచారు. రాష్ట్ర బడ్జెట్ మేడిపండులా ఉంది. అంతా కాగితాల రూపంలో చూపించడం తప్పితే చేతల్లో ఏమి కనిపించడం లేదు. పోలవరం, రాజధాని నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. రైతులు పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడతా ఉంటే రూ. 300 కోట్లు కేటాయించడం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలు కలిసి రైతాంగాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. బడ్జెట్ అంకెల గారడి మాదిరిగా ఉంది

- షేక్ మస్తాన్ వలి, కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యులు

రేపటి నుంచి మారుతీ దేవాలయ బ్రహ్మోత్సవాలు



విద్యుద్దీపాలంకరణతో మారుతీ దేవాలయం

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మారుతీనగర్‌లోని దేవాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల రెండో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఐదు రోజులపాటు పాంచాన్హిక దీక్షతో హనుమద్ రుద్రయాగం, గణపతి హోమం, శ్రీచండీ మహావిద్య హోమాలు, నిత్య కళ్యాణోత్సవాలు, సామూహిక పూజలు వంటివి విశేషంగా జరగనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ప్రత్యేకంగా ఆలయ అర్చమూర్తుల హోమాలు ఉంటాయని తెలిపారు. ఈనెల 2న ఉదయం కలశస్థాపన గోపూజ, బాల పూజలతోపాటు సిద్ధి బుద్ధి సమేత గణపతి కల్యాణ మహోత్సవం, మూడో తేదీన శ్రీగంగా గౌరీ సమేత గౌరీశంకరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చనలు, గంగా గౌరీశంకర్‌స్వామి కల్యాణం, 4న శ్రీసూచన సమేత ప్రసన్నాంజనేయస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, లక్ష తమలపాకుల పూజ, సువర్చలా ప్రసన్నాంజనేయస్వామి కల్యాణం, ఐదో తేదీన శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామని అన్నారు. ఆరో తేదీన తూర్పు రాజగోపుర కలశాల స్థాపన, శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం, పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు. భక్తుల హాజరై, స్వామి వారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. దేవాలయాన్ని విద్యుద్దీపాలంకరణతో అలకరించారు.

వికసిత్ భారత్ దిశగా శాస్త్రీయ ఆవిష్కరణలు ఉండాలి



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో గౌసుల్‌మీరా, ఖాసిం, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: వికసిత్ భారత్ దిశగా విద్యార్థులు శాస్త్రీయ ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జి.ఏసురత్నం పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్లోని పరీక్షా భవన్‌లో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సమగ్ర శిక్ష, అప్‌కాస్ట్-విజయవాడ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఏసురత్నం మాట్లాడుతూ ప్రతి ఏటా ఒక్కో నినాదంతో జరుపుకుంటుండగా, 2025ను 'వికసిత్ భారత్ కోసం సైన్స్, ఇన్నోవేషన్‌లో గ్లోబల్ లీడర్‌షిప్ కోసం భారతీయ యువతకు సాధికారత' నినాదంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. గుంటూరు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలతోనే వాస్తవాలు వెలుగులోనికి వస్తాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ మొహమ్మద్ ఖాసిం, ఎంఈవో బీవీ రమణయ్య, హెచ్‌ఎం వసుంధర, రిసోర్స్ పర్సన్లు అప్పారావు, వెంకటేశ్వరరావు, గంగాధర్, భాస్కరరావు, ఏకాంబరేశ్వరరావు గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

■ వ్యాసరచనలో సీనియర్, జూనియర్ విభాగాల్లో ఎం.భవిష్య, జెడ్పీ హైస్కూల్(ఉప్పలపాడు), కె.హారిక, జెడ్పీ హైస్కూల్ (నారాకోడూరు) ప్రథమ బహుమతి పొందగా, షేక్ జిక్ర, కేకే మున్సిపల్ హైస్కూల్(మంగళగిరి), సీహెచ్ సందేశ్, ఎంసీయూపీ పాఠశాల, వినోభానగర్(గుంటూరు) ద్వితీయ బహుమతి, వసీం అరాఫత్, హిందూ కాలేజ్ హైస్కూల్(గుంటూరు), వంశీ, ఎంపీపీ స్కూల్ (చమళ్లమూడి) తృతీయ బహుమతి పొందారు.

■ వక్తృత్వంలో ఆర్.కీర్తి, జలగం రామారావు ఉన్నత పాఠశాల (గుంటూరు), సీహెచ్ సందేశ్, ఎంసీయూపీ పాఠశాల, వినోభానగర్ (గుంటూరు), ఎన్.జాహ్నవి, ఏపీఆర్ మైనారిటీ బాలికోన్నత పాఠశాల (గుంటూరు), పి జాస్మిన్, కేకే మున్సిపల్ హై స్కూల్ (మంగళగిరి), షేక్ సమీరా బాయి, పులిపాక హైస్కూల్ (గుంటూరు), ముబష్శిర, జెడ్పీ హైస్కూల్ (ఉర్దూ-అమీనాబాద్) బహుమతులు పొందారు.

■ చిత్రలేఖనంలో షేక్ రేష్మ పర్వీన్, జలగం రామారావు ఉన్నత పాఠశాల(గుంటూరు), కె.హరి కార్తీక్, ఎంపీయూపీ స్కూల్ (ములుకుదురు), బి.జాహ్నవి, జెడ్పీ హైస్కూల్ (కాకుమాను), కె.ప్రణతి, జెడ్పీ హైస్కూల్(నారాకోడూరు), టి.శాంతి, శారదా నికేతన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుంటూరు), సనా ఫాతిమా, ఎంసీయూపీ పాఠశాల, వినోభానగర్(గుంటూరు) బహుమతులు అందుకున్నారు.

అతీగతీ లేని బడ్జెట్

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్



లక్ష్మీపురం: అతీగతీలేని బడ్జెట్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్‌లో శుక్రవారం బడ్జెట్ పై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ రంగానికి, నీటిపారుదల రంగానికి ప్రాధాన్యతే ఇవ్వలేదన్నారు. సూపర్‌సిక్స్ హామీలకు నిధులు కేటాయింపు లేదని చెప్పారు. ఉచిత బస్సును అటకెక్కించారని, ప్రతినెలా మహిళకు రూ.1500 బడ్జెట్‌లో ప్రస్తావించనేలేదన్నారు. కూటమి పాలనలో ఏపీ చరిత్రలోనే రికార్డు స్థాయి అప్పులకు రంగం సిద్ధమైందని ఈ బడ్జెట్ స్పష్టంగా చెబుతోందని పేర్కొన్నారు. ఈ గాలి బడ్జెట్‌ను గొప్ప బడ్జెట్‌గా కీర్తిస్తున్న కూటమి నేతలు ఊహల నుంచి వాస్తవాల్లోకి రావాలన్నారు. పైగా దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన మోదీని పదేపదే కీర్తించడం మరీ విడ్డూరమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిరుద్యోగులకు మొండి చేయి

-డి.వై.ఎఫ్.ఐ జిల్లా కన్వీనర్ కృష్ణకాంత్



లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ఉపాధి రహిత బడ్జెట్, నిరుద్యోగులకు మొండిచేయి చూపించిందని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ అన్నారు. బ్రాడీపేట కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా కనీసం బడ్జెట్‌లో ప్రస్తావన కూడా చేయలేదని ధ్వజమెత్తారు. డీఎస్సీ లేదని, గ్రూప్-2 అభ్యర్థులు పెద్దఎత్తును ఆందోళన చేసి రోస్టర్ విధానం మీద ప్రభుత్వ నిర్ణయం కాని, ఉద్యోగాల కల్పన విషయం పూర్తిగా మరిచారన్నారు. కంపెనీలు వస్తున్నాయని మాటలే తప్ప ఆచరణలో విధివిధానాలు ఏమిటి అనే ప్రస్తావన కూడా బడ్జెట్‌లో లేదని తెలిపారు.

విద్యార్థుల్లో వైజ్ఞానిక ఆసక్తిని పెంపొందించాలి



శ్రీచైతన్యలో ప్రాజెక్టులను తిలకిస్తున్న రాకేష్‌బాబు



టీజేపీఎస్‌లో ప్రసాద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్



సుమేధలో సైన్స్ ప్రాజెక్టులతో విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో వైజ్ఞానాసక్తిని పెంపొందించడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ రాకేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం శ్యామలానగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు వైజ్ఞానిక ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈసందర్భంగా ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు తమ ప్రతిభతో దాదాపు 500 ప్రాజెక్టులను ప్రదర్శించడంతోపాటు వాటి విశేషాలను సందర్శకులకు వివరించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ రాకేష్ బాబు హాజరయ్యారు. శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణకుమారి, గుంటూరు నగర కో-ఆర్డినేటర్ సచ్చిదానందమూర్తి, ఏవో శివకుమార్, శివప్రసాద్ పాల్గొన్నారు.

సైన్స్‌కు సాంకేతికతను జోడించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సైన్స్‌కు సాంకేతికతను జోడించాలని హిందూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.మల్లికార్జున ప్రసాద్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పీఎం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ అంటే మక్కువ పెంచుకోవాలని, మానవ జీవితంలో దాదాపు అన్ని కార్యకలాపాలు సైన్స్‌పై ఆధారపడి ఉన్నాయని చెప్పారు.ఈసందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, భౌతిక, రసాయనశాస్త్ర విభాగాధిపతులు ఎం.రేణుక, ఎంఎల్ఎస్ రాజగోపాల్, బి.జ్యోతి, వి.వేణు, షేక్ సల్మా సుల్తాన్, వై.అన్నపూర్ణ పాల్గొన్నారు.

సైన్స్‌తోనే అభివృద్ధి సాధ్యం

లక్ష్మీపురం: దేశ పౌరులంతా సైన్సుని ఒక వెన్నెముకగా చేసుకుని ప్రగతి పథంలోకి నడవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు టి.నారపరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సైన్స్ డే నిర్వహించారు. యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్, సంస్థకార్యదర్శి కొండాశివరామి రెడ్డి మాట్లాడారు.

హిందూ ఫార్మసీ కళాశాలలో...

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ''సైన్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్-ప్రమోటింగ్ గ్రీన్ టెక్నాలజీ'' అనే అంశంపై వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ పరిశోధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈసందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదన రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేదాంత హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ కిడ్నీ నిర్ధారణ, చికిత్సా పరిశోధనలను గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల పాలకమండలి సభ్యుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, పీజీ కళాశాల ఎంబీఏ డైరెక్టర్ డాక్టర్ రమణ, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల డీన్ డాక్టర్ సతీష్, నరసరావుపేట ఫార్మసీ కళాశాల ఫార్మకాలజీ విభాగాధిపతి ఎస్.కొదండరాం, హిందూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ పి. సీతారామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణను సన్మానించారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో శాస్త్రీయ విజ్ఞానంతో భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని జేకేసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు పేర్కొన్నారు. ఎస్వీఎన్ కాలనీలోని నారాయణ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో, అకడమిక్ ఫెయిర్‌ను ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ లవీణారెడ్డి పుస్తకాల్లోని పాఠ్యాంశాలను విద్యార్థులతో స్వయంగా నమూనా ప్రాజెక్టు రూపంలో తయారు చేయించి ప్రదర్శిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌జీఎం శ్రీనివాసులురెడ్డి, పాఠశాల కో-ఆర్డినేటర్ సీతారామయ్య, ఈ-చాంప్స్ కో-ఆర్డినేటర్ అపర్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ కార్నివాల్

గుంటూరు ఎడ్యుకేషన్: ఎస్వీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో శుక్రవాకం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ కార్నివాల్ ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు.

విశ్వంలో ప్రతి గ్రహం కదలిక విజ్ఞానశాస్త్రమే

గుంటూరు ఎడ్యుకేషన్: విశ్వం మొత్తం విజ్ఞానశాస్త్రంతో ముడిపడి ఉందని, ప్రతి గ్రహం కదలిక ఒక విజ్ఞానశాస్త్రమేనని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో శుక్రవాకం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏఓ కె.వెంకట్రావు, అకడమిక్ సమన్వయకర్త బి.శైలజ పాల్గొన్నారు.



హిందూ ఫార్మసీలో రామకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం



డాక్టర్ కేఎల్పీలో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళి

ప్రతి ఒక్కరి సేవలు భావితరాలకు ఆదర్శనీయం



ఉద్యోగ విరమణ పొందిన వారితో జిల్లా ఎస్పీ

నగరంపాలెం: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించిన ఎస్ఐలు సీహెచ్ వెంకటేశ్వర్లు (డీసీఆర్‌బీ), కె.శ్రీహరి(నగరం పాలెం పీఎస్), హెడ్ కానిస్టేబుల్ ఎండీ.ఖాసీం (పట్టాభిపురం పీఎస్) శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు ఇద్దరు ఎస్ఐలు, హెచ్‌సీని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో పూలమాలలు, శాలువాలతో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సత్కరించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అందించిన సేవలు భావితరాలకు ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), హనుమంతు(ఏఆర్), ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, సీఐలు అలహరి శ్రీనివాస్(ఎస్‌బీ), నాగ మల్లేశ్వరరావు, బి.నరసింహారావు (డీసీఆర్‌బీ), ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, రామకృష్ణరెడ్డి, రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దళవాయి సుబ్రహ్మణ్యం, జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు మైల సాంబశివరావు, లక్ష్మయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

యువ సంగీత రత్న పురస్కారం ప్రదానం



చాగంటి రమ్య కిరణ్మయికి పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎంవై.శేషురాణి ఆధ్వర్యంలో (పూర్వ ఉపాధ్యక్షులు) శారదా గోవిందరాజుల జ్ఞాపకార్థం సంగీత సభా నిర్వహించారు. తొలుత నీరజకిరణ్ మండపాటి (సింగపూర్) జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం.రమణప్రసాద్ మాట్లాడుతూ గాయత్రీ మహిళా సన్మండలి యువ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. యువ కళాకారిణి విదుషి చాగంటి రమ్య కిరణ్మయి (చెన్నై)ని యువ సంగీత రత్న పురస్కారంతో అతిథులు, సంస్థ నిర్వాహకులు సత్కరించారు. అనంతరం చాగంటి రమ్య కిరణ్మయి శాస్త్రీయ సంగీత గాత్ర కచేరీ అలరించింది.

ఎన్నికలలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

లక్ష్మీపురం: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ తీవ్రమైన అక్రమాలకు పాల్పడిందని, వీటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముందు రోజే ప్రజా సంఘాల కార్యకర్తలను బెదిరించారని ఆరోపించారు. ప్రచారం సమయం ముగిసిన అనంతరం కూడా ఎన్నారై కాలేజీ, కిట్స్ కాలేజీ విద్యార్థులతో గుంటూరులో హెల్ప్ డెస్క్ పేరుతో శిబిరాలు ఏర్పాటు చేసి, అధికార పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం నిర్వహించారని చెప్పారు. గుంటూరులో అధికార పార్టీ కార్పొరేటర్లు, తెనాలిలో కౌన్సిలర్లు పోలింగ్ బూత్‌లలోకి ఇష్టానుసారం జొరబడ్డారని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు, కె.నళినీకాంత్ పాల్గొన్నారు.

వీనుల విందుగా మహాశివునికి వీణానాదార్చన



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట ఓంకార క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం సాయంత్రం శ్రీభారతీ సంగీత నిలయం వ్యవస్థాపక అధ్యక్షురాలు భారతీదేవి శిష్య బృందంతో వీణా కచేరి నిర్వహించారు. కచేరిలో మృదంగంపై జగన్మోహిని, శిష్యులు కె.మృణాళిని, నాగలక్ష్మి, భవాని, వర్ధని పాల్గొన్నారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ కార్యదర్శి నంబూరు వేంకటనారాయణమూర్తి సత్కరించారు.

పేదలకు రోగులకు సాయం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో షాపర్స్ స్టాఫ్ (ఫియోనిక్ మాల్) వారు శుక్రవారం 250 కేజీ బియ్యం, 30 దుప్పట్లు రోగులకు వితరణ చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ పేద రోగులకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు.